


కూడగట్టుకొని నడుస్తున్నడు ముసలయ్య.

సస్తాబతుకుతా ఇల్లు చేరిండు.

మందను దొడ్లె తోలి.. సాలిగ గల్మల్లనే ఇసురుకొని పడ్డడు ముసలయ్య.

జీవాలను లెక్కబెట్టుకొని ముసలయ్యను లేపి చూసిండు సైదిరెడ్డి. ఎగపోత – దిగపోతగా ఉన్నది ప్రాణం. ముసలయ్యను జీతగాళ్లతో ఎత్తించి, ఇంటికి తోల్కపొమ్మన్నడు.

''అయ్యా! దవాఖానకు తోల్కపోదం. ముసలోడు కాలిపోతాండు!''.. సైదిరెడ్డితో అన్నరు జీతగాళ్లు.

''తెల్లారి సూద్దాం లేరా! ఈ నాత్రి ఏడికి తోల్కపోతం రా!'' అని గదమాయించి.. ఆళ్ల నోరు మూయించిండు సైదిరెడ్డి.

రాత్రంతా పెండ్లాం, కొడుకు.. కండ్లార్పకుండ కాళ్లు, చేతులు రుద్దుతనే ఉన్నరు. ముసలయ్యకు గంజి కూడా గుటక పడటం లేదు. ముసలయ్య కండ్లు తెరిచి, పెండ్లాన్ని, కొడుకును చూసుకున్నడు. ఎండిపోయిన కండ్లపొంటి.. వెచ్చగా నీటి చుక్కలు బైటికొచ్చినయి.

'గుడ్డి పెండ్లాం, కుంటి పోరడు. నేను పుటుక్కుమంటే ఈళ్ల గతేంకాను!'.. అంత బాధలోనూ ముసలయ్యకు తన భార్యా పిల్లల భవిష్యత్తే కండ్లముందు కదిలింది. తనకోసం కాకున్నా.. అశక్తులైన తన వాళ్లను బతికించడం కోసమన్నా తనను బతికించమని కోటి దేవుండ్లకు మొక్కుకున్నడు.

* * *

ముసలయ్యకు సైదిరెడ్డి యాదికొచ్చిండు. జీవితాంతం చాకిరీ చేయించుకున్న యజమాని. తన పానం మీదికి వస్తే ఒట్టిపోయిన గొడ్డులా ఒదిలేసిండే తప్ప.. 'అయ్యో!' అనలేదు. 'అయినా! కటికోనికి గొర్రె మీద ఏం ప్రేమ!' అనుకున్నడు.

ముసలయ్య ఒళ్లు దాచుకోకుండా చేసిన పుట్టెడు చాకిరీతో నాలుగు మేకలు.. వంద మేకల మంద అయ్యిందనీ, ముసలయ్యకు ఇచ్చే జీతంకన్నా వాడు తెచ్చిన లాభమే ఎక్కువని సైదిరెడ్డికి తెలిసినా! ఇదంతా తన అదృష్టం అనుకున్నాడే తప్ప.. ముసలయ్య శ్రమకు విలువకట్టలేదు. సైదిరెడ్డి దృష్టిలో ముసలయ్య ఒక కూలోడు మాత్రమే.

'వాడు జీతం తీసుకుంటున్నడు. దానికి తగ్గ పని చేస్తున్నడు. డబ్బుంటే చాలు.. ముసలయ్య కాకుంటే మరొకడు ఆ పనిచేస్తడు. అంతే!'.. ఇది సైదిరెడ్డి సిద్ధాంతం. పెట్టుబడిదారీ ఆలోచనలో డబ్బుకున్న విలువ మనిషికి ఎందుకు ఉంటుంది? మనిషి కూడా ఒక పనిచేసే యంత్రం మాత్రమే! ఈ ఆలోచనే తరతరాల శ్రమ దోపిడీకి పునాదులు వేసింది. ఈ అంతరమే సమాజంలో వర్గపోరాటానికి దారులు వేసింది. ఈ అహంకారమే చరిత్రలో అనేక తిరుగుబాట్లకు ఆజ్యంపోసింది.

**పట్నం పోయే తోవలో.. సైదిరెడ్డి ప్రమాదానికి గురై ప్రాణం మీదికి తెచ్చుకున్నడు. ముసలయ్యకు డబ్బులిస్తే తిరిగి రావన్న సైదిరెడ్డి కక్కుర్తి ఆలోచనతో పెట్టుకున్న అనవసరపు ప్రయాణం వల్ల.. ఉన్న గొడ్డూ – గోదా, ఆస్తి – పాస్తులు అమ్మి.. దవఖానకు లక్షలు ధారపోసినా సైదిరెడ్డి ప్రాణం మాత్రం నిలబడలేదు.**

కానీ, ముసలయ్య దృష్టిలో యజమాని అంటే దేవుడు. ఎదిరించి మాట్లాడటం, కనీసం నోరుతెరిచి తన అవసరాన్ని అడగడం కూడా స్వామి ద్రోహం అని తలిచే స్వభావం కలవాడు. పుట్టెడు చాకిరీ చేసినా.. శ్రమకు తగ్గ ఫలం వచ్చిందా? రాలేదా? అని కూడా ఆలోచించే వాడు కాదు. రెక్కలు ముక్కలు చేసుకొని తన శక్తినంతా ధారపోసి, యజమాని చెప్పిన పనిచేయడమే తన కర్తవ్యం అనుకునేవాడు. కానీ, అంతర్లీనంగా ఈ పని వదిలే ధైర్యం, మరో పని వెతుక్కునే ఆత్మవిశ్వాసం, తన శ్రమ శక్తి మీద నమ్మకం కానీ.. ముసలయ్యకు లేకపోవడం ఒక కారణం అయితే, ప్రశ్నించే ధైర్యం, అండగా నిలబడే సంఘటిత బలం లేకపోవడం.. ఇలాంటి బలహీనుల గొంతు పెగలకపోవడానికి మరో కారణం!

'ముసలయ్య పరిస్థితి బాగాలేదు. వాని ప్రాణం ఇప్పుడో అప్పుడో అన్నట్లుంది. వాడు బతికితే దవాఖాన ఖర్చులకు డబ్బులియ్యాలి! చస్తే చావు ఖర్చులకు డబ్బులియ్యక తప్పదు! కానీ, ఒక వేళ ఇస్తే.. వాడు పుటుక్కుమన్నాక పైసలు తిరిగొచ్చేది ఎట్లా? గుడ్డి పెండ్లాం, అవిటి పోరడు ఇచ్చిన అప్పెట్ల తీరుస్తరు?' అని తలపోసిండు సైదిరెడ్డి.

దొరలకు ప్రాణం ఉన్న మనుషుల కంటే.. ప్రాణం లేని పైసలంటేనే మక్కువ మరి!

ఎందుకొచ్చిన లొల్లి పంచాయితీ అనుకొని.. లేని పనిని కాయించుకొని వారందాకా ఇంటికి రానని పెండ్లానికి చెప్పి, రాత్రికి రాత్రే పట్నం దారివట్టిండు సైదిరెడ్డి.

కానీ, ఎవనిగతి ఏం కానున్నదో.. ఎవనికెరుక!? కొందరు 'విధి లిఖితం' అన్నా! మరికొందరు 'పాపం పండింది' అన్నా.. జరిగేది జరగక మానదు.

పట్నం పోయే తోవలో.. సైదిరెడ్డి ప్రమాదానికి గురై ప్రాణం మీదికి తెచ్చుకున్నడు.

ముసలయ్యకు డబ్బులిస్తే తిరిగి రావన్న సైదిరెడ్డి కక్కుర్తి ఆలోచనతో పెట్టుకున్న అనవసరపు ప్రయాణం వల్ల.. ఉన్న గొడ్డూ – గోదా, ఆస్తి – పాస్తులు అమ్మి.. దవఖానకు లక్షలు ధారపోసినా సైదిరెడ్డి ప్రాణం మాత్రం నిలబడలేదు.

ముసలయ్య.. పైసలు లేని కారణంగా నవిసి నవిసి ఊపిరి వదిలిండు. సైదిరెడ్డి.. డబ్బులకు కక్కుర్తిపడి ప్రాణం పోగొట్టుకున్నడు.

ముసలయ్యకు బాధ్యతలు ఉన్నాయనో! సైదిరెడ్డికి డబ్బులు ఉన్నాయనో చావు రాకమానదుగా! చావు తూకంలో అంతా సమానమే!

డబ్బులు లేక చచ్చిన ముసలయ్య శవం, డబ్బులు పెట్టినా దక్కని సైదిరెడ్డి శవం.. రెండూ కాష్టాలగడ్డకు చేరుకున్నయి.

డబ్బులుండి చచ్చిన సైదిరెడ్డి, డబ్బులేక చచ్చిన ముసలయ్య ఇద్దరివీ వట్టి చేతులే! ఇద్దరి పేర్లూ ఒక్కటే.. 'శవం'. ఇద్దరూ కాలి బూడిదయ్యింది కట్టెల మంటల్లోనే!

ముసలయ్య ఉసురుగొట్టి, సైదిరెడ్డి చచ్చిండని.. ఊరంతా గుబగుబలాడింది.

ముసలయ్యను చూసి.. 'అయ్యో పాపం!' అన్న జనాలే..

సైదిరెడ్డిని చూసి.. తుపుక్కుమని ఊసిన్రు.

ఆ రాత్రి కురిసిన వాన.. కులం – మతం, బీద – ధనిక అనే ఏ వివక్షా చూపకుండా ఇద్దరి బూడిదలనూ కలిపేసింది. కానీ, ఈ మనుషుల అంతరాలు చస్తే తప్ప పోవనుకుంటా!

అందుకే మనిషిని మనిషిగా ప్రేమించలేని మనిషికి, మరణంలోనూ ప్రశాంతత ఉండదనుకుంటా! ■

## రంగనాథ్ సుదర్శనం



రచయిత రంగనాథ్ సుదర్శనం స్వస్థలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు. ఎం.ఎ (సమాజ శాస్త్రం) చదివారు. సింగరేణిలో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. 2019 నుంచి కథలు రాస్తున్నారు. ఇప్పటివరకు 86 కథలు రాశారు. మొదటి కథ.. 'నవ్వులపాలైన పెళ్లి' గోతెలుగు వెబ్ మ్యాగజైన్‌లో ప్రచురితమైంది. ఆ తరువాత ఎన్నో కథలు.. గోతెలుగు, సహరి, హాస్యానందం, జాగృతి, తపస్వీ మనోహరం, మన తెలుగు కథలు, సుకథ వంటి వివిధ మాధ్యమాల్లో ప్రచురితమయ్యాయి. 'ఉరిమెళ్ల ఫౌండేషన్ అక్షరాల త్రోవ' నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కథల పోటీలో.. 'ఎక్కిరింపు' కథకు మొదటి బహుమతి అందుకున్నారు. గోదావరి రచయితల సంఘం కథల పోటీలో 'దేవుడు పారిపోయాడు'కు ద్వితీయ బహుమతి వచ్చింది. వివిధ పోటీల్లో.. 'దేవునిచెట్టు', 'రథం ముగ్గు', 'బాల బంధువులు', 'లోకం పోకడ', 'గ్రహణం విడిచింది', 'ఆరిపోని దీపం' కథలు బహుమతులు గెలుచుకున్నాయి.